# దేవాలయ శిఖరాలు

శ్రీమతి పట్టిసపు భవానీగంగాధర్

ప్రశాంత నిశీధి. అతి ప్రశాంతమైన వెన్నెల. సందడి, జనకోలాహలము వినిపించని ప్రశాంతమైన పచ్చనిపైరులు. ఈ నిశ్శబ్దాన్ని భేధించుకొంటూ, తన కడుపులో వివిధరకాలైన శబ్దాల్నిచేసే మానవుల్ని రాచుకొంటూ గమ్యస్థానాన్ని చేరుకోవాలనే ఆతృతతో శరవేగంగా పరుగులేస్తున్నది రైలు. రైలు కంపార్టుమెంటులోని అద్దాలకిటికీ నానుకొని ఏమీ తోచక దిక్కులుచూస్తూ కూర్చున్నాను. దూరంగా ఆకాశానికి భూమికి సరిహద్దు. ఆ సరిహద్దు కీవలగా ఎన్నో రకాలైన చెట్లుచేమలు రైలును చూసి భయంభయంగా వెనక్కి అడుగులేస్తున్నాయి. దూరంగా అక్కడక్కడ మట్టితో కట్టిన గడ్డియిళ్ళు. వాటిల్లోంచి మినుకుమినుకుమనే దీపాల వెలుగులు కానవస్తున్నాయి.

హఠాత్తుగా నా దృష్టి నాకర్షించిన వింతైన దేవాలయ గోపురం. వెన్నెల్లో తళతళ మెరుస్తున్నట్లుగా గోచరించింది. దాని ప్రక్కనే మరొక గోపురం. రెండు గోపురాలు దగ్గరదగ్గరగా నిర్మించబడ్డాయి. దూరంగా చెట్ల కొమ్మల్లోంచి వింతగా మెరుస్తూ కనబడుతున్నాయి వాటి శిఖరాలు. ఈ నిర్మానుష్య ప్రదేశంలో ఈ ప్రశాంత ప్రకృతిలో అవి అలా ఎందుకు నిర్మించబడ్డాయి? వీటి వెనుక ఏదో వింత గాథ వుండేవుంటుంది. కాని ఎలాగ తెలుస్తుంది ఆ గాథ? ఆలోచనల్తో బుర్ర బరువెక్కింది. మెల్లిగా రైలు కుదుపుకి నిద్రలో మైమరచింది శరీరం.

◆ ◆ ◆

అవి ఔరంగజేబు సుల్తాను ఢిల్లీ నగరాన్ని పరిపాలిస్తూవున్న రోజులు. పరమత ద్వేషంలో మానవత్వాన్ని మరచిన మొగలులు హిందువులను పశువులకన్న అన్యాయంగా హింసించిన రోజులవి! ఎటు చూసినా గో బ్రాహ్మణ రక్తప్రవాహం అనర్గళంగా ప్రవహిస్తున్నది. కాఫరన్నవారు ఆ మహాప్రవాహంలో మునిగి, కొరాను పఠించి; కబాబులు తినవలసిందే! "శంభో శంకర!" "హరహరమహాదేవ్!" అని అరచినవానికల్లా అరచేతిలో వైకుంఠం చూపించేవారు అప్పటి మొగలులు. మానరక్షణకై ఎంతమంది హిందూ సుందరులు తమ సుకుమార దేహాల్ని అగ్నికర్పించివేశారో! హిందూధర్మ రక్షణ కోరిన హిందూ యువకులెందరు మొగలుల కరకు కరవాలాలికి బలి అయిపోయారో! కుసుమకోమలులైన పసిబిడ్డలు, జరాభారులైన వృద్ధులు ఎంత నిర్దాక్షిణ్యంగా చిత్రవధ చేయబడ్డారో అవన్నీ ఊహించవలసినవేకాని, కలంతో చిత్రించలేని దారుణ దృశ్యాలు...!!!

ఈ కథ జరిగేనాటికి పరిస్థితులు ఇలాగ ఉన్నాయి. పరిస్థితులు ఇలాగ ఉండబట్టే ఈ కథ జరుగవలసిన అగత్యం ఏర్పడినది.

◆ ◆ ◆

కలకలలాడే కాపురమది. చూడ ముచ్చట గొలిపే ఆదర్శప్రాయమైన జంట అది. వారే మాధవీ ఆనందులు. ఉన్న కొద్దిభూమి కాయకష్టంచేసి దున్ని పండించి సంసారం యీదుకుంటూ, ఏ లోపం రాకుండా, కాపాడుకొంటున్నాడు ఆనందుడు. పెరట్లో వున్న పాడి, ఆవు, మొక్కలు, పూరిపాక వీటిని జాగ్రత్తగా కాపాడుకొంటూ, భర్త తెచ్చే సంపాదన జాగ్రత్తగా సర్దిపుచ్చి, సంసారం స్వర్గ తుల్యంగా నడుపుకొస్తుందా యిల్లాలు మాధవి.

తొలి కోడితోటే లేచి ప్రాచిచేసి, పాలుతీసి, ఆవును పూజించి, పెరుగు వెన్న చేసి, భర్తకు చద్ది వండిపెట్టి, పొలానికి పంపి, యింట్లో పనిపాటా చక్కబెట్టుకొనేది మాధవి.

నాగలి భుజాన వేసుకొని, ఎడ్లను తోలుకొని, పల్లెపదాలు పాడుకొంటూ, మాధవిని తలంచుకొంటూ హుషారుగా పొలానికి పోయేవాడు ఆనందుడు. కరకరలాడుతూ సహస్రకిరణుడు నడినెత్తికొచ్చే వేళకు నాగలి సడలించి, ఎడ్లకు మేత వేసి, చెట్టునీడకు చేరి, మాధవి కాలు అందెల ధ్వనికోసం యెదురుచూసేవాడు ఆనందుడు.

తన కంటికి అపురూపంగా దొరికిన కాయ, కసరు, ఆప్యాయంగా వండి గట్టిగా తోడుపెట్టిన తమ ఆవు పెరుగు, బువ్వ పట్టుకొని, కళ్ళల్లో ఎన్నో ప్రేమ భావాలు, అమాయకపు కబుర్లు నింపుకొని, భర్తకు "ఆలస్యమవుతుందేమో! ఆకలితో యెదురు చూస్తున్నాడేమో!" అని ఆతృతగా అడుగులు వేసుకొంటూ వచ్చేది మాధవి.

ఇద్దరూ అమాయకంగా యేవో కబుర్లు చెప్పుకుంటూ తినేవారు. తరువాత ఆనందుడు పొలంపని చూసుకుంటూ వుంటే, మాధవి తమ పశువులకు కావలసిన గడ్డి సేకరించుకొనేది.

ప్రొద్దుతిరిగే వేళకు యిద్దరూ పశువులను తోలుకుంటూ ఏవో అర్థంకాని కబుర్లు చెప్పుకుంటూ యింటికి చేరుకొని తిరిగి గృహకృత్యాల్లో లీనమైపోయేవారు.

ఈ విధంగా ఏ చీకూ, చింతా లేకుండా ఒకరికొకరు ప్రేమించుకొంటూ, ఒకరి కష్ట సుఖాలను మరియొకరు పంచుకొంటూ ఆదర్శవంతంగా కాలం గడుపుతున్నారా మాధవీ ఆనందులు.

◆ ◆ ◆

ఆరోజు మాధవి వొక్కర్తే వుంది. ఇంట్లోని గృహకృత్యాల్లో లీనమై వుందామె. ఆనందుడు ఆరోజున పొలంలో ఏదో పని వుండడాన్ని యింటికిరాలేదు.

ఇంతలో బయట ఏదో కోలాహలం వినిపించేసరికి, పనిపాటలు వదలి వెలుపలికి వచ్చిందామె. "అదిగో! వహ్వారే! ఎంత అందం! పట్టండిరా! దాన్ని!" అనే కేకలు, నినాదాలతో మొగలు సైన్యం మహాకోలాహలంగా బిలబిలలాడుతూ వచ్చేస్తున్నారు.

ఒక్కక్షణం మతిపోయిన దానిలాగ చూస్తూ వుండిపోయింది మాధవి. ఇంతలో అశ్వపద ధ్వానాలామె కర్ణపుటాల్ని ప్రవేశించాయి. ఒక్క లిప్తలో మారిపోయిందామె! నడుముకి పైట గట్టిగా బిగించింది.

జీరాడే కుచ్ఛెళ్ళు ఎగగట్టింది. మొహం రక్తవర్ణమైపోయింది! ఏదో వింత శక్తి ఆవరించింది! శక్తికొద్దీ పొలంవైపు పరుగు తీసింది. ముందామె!... వెనుక మొగలు సైన్యం....!

ఎడ్లు నడలిస్తూ భూమి దున్నుతున్నా డానందుడు. నుదుట చెమట బిందువులను తుడుచుకునేటందుకు శిరమెత్తి చూశాడు. అల్లంతదూరంలో ఎవరో...పరుగెత్తుకొంటూ తనవైపే వస్తున్నారు...! "ఎవరది?" రెండడుగులు ముందుకు వేశాడు! ప్రాణలు "ఝల్లు"మన్నవి! "ఎవరు? తన జీవితసర్వస్వం మాధవి!" – కారణ మేమో ఊహించ లేక పోయాడు. మాధునిలా చూస్తూ ఉండిపోయాడు.

దూరంలో కలకలం వినబడ్డది. తీక్షణంగా అటుకేసి దృష్టి సారించాడు. మొదట అర్థంకాలేదు. నిదానించి చూశాడు. దేహంలోని యువకరక్తం పొంగింది.! మొగలు సైన్యం...! మాధవి యింకా దగ్గరయింది. అతనికంతా అవగాహన అయింది. ఒకడుగు వెనక్కి వేశాడు. త్వరత్వరగా ఎడ్లను నడలించి తోలేశాడు. నాగలి రెండు చేతుల్లోకి తీసుకొని నిలువబడ్డాడు. ఆహా! ఎంత గంభీరమూర్తి!!

మాధవి చేరువకి వచ్చింది. ఒక్కక్షణం వారి నేత్రాలు సంభాషించుకున్నాయి. అంతే! మాధవి పతి పాదములపై ప్రణమిల్లింది. ఆనందుడామెను తేరిబార వీక్షించాడు. రెండు నేత్రాలలోను నీళ్ళు నిలచినవి! ఒక్కసారి నేత్రములు మూసుకొన్నాడు.

అశ్వపద ఘట్టన మతివేగంగా సమీపిస్తున్నది! మాధవి తలయెత్తి ఆనందుని వంక అతిదీనంగా చూసింది. మాధవునికి తనకర్తవ్యం స్ఫురణకు వచ్చింది. వెంటనే విజృంభించాడు.... చేతనున్న నాగలి పైకెత్తి...కన్నుల మూసుకొని..."హరహరమహాదేవ్" అని వుచ్చరించి... బలంగా...ఒక్క...వ్రేటు వేశాడు...!!! అంతే! మహాసౌందర్యమూర్తి-మాధవి... రక్తపుమడుగులో స్నానమాడింది!

ఆనందుడీ లోకమున లేడు...అతని ఆకారమే మారిపోయింది..చిదానందుడైన ఆనందుడు హాసప్రఫుల్ల వదనుడైన ఆనందు - అతిరౌద్ర భీభత్సమూర్తియై పోయినాడు. సమీపమునను్న ధాన్య రాశి రాశినంటించి మాధవి శరీరమును పూలమాలవలె పైకెత్తి అందులో వేశాడు!

ఇంతలో మొగలు సైన్యం సమీపించినది. జరిగిన దారుణకృత్యమును గాంచి వారు నిర్ఘాంతపోయి నిలచినారు. ఆనందుడతి తీవ్రముగా విజృంభించినాడు! చేతనున్న నాగలినే కరవాలముగా నుపయోగించి వారితో రణమొనర్చినాడు. ఆనాడు ఆనందుని ప్రతాపమునకడ్డులేదు. సైనికులమీద సైనికులు దీపముపై శలభములవలె, ఆనందునిపైకి దండెత్తి నిహతులై కూలిపోవుచునే యున్నారు. ఆనందుని యొడలంతయు గాయములతో నిండి, రక్తసిక్తమై క్రమక్రమముగా బలము క్షీణింపసాగినది. కొలదిసేపటిలో మహావీరు డానందుడు శక్తిహీనుడై శత్రు

మధ్యమున నాగటిని విడిచి మాధవి ప్రక్కనే యొరిగిపోయినాడు!

అనలుడు ప్రశాంతముగ ప్రజ్వరిల్లుచు నా దేవతామూర్తులను తనయందు లీనమొనర్చుకొన్నాడు. ఏదో తెలియని భక్తి భావము ఆ మొగలు సైనికుల హృదయాంతరాళముల నలముకున్నది. శిరము వంచి నమస్కరించి వారు వెడలి గ్రామస్థులతో జరిగిన కధనంతయు తెలియజేసినారు.

అనతికాలములోనే ఆ ప్రాంతములో దేవాలయము వెలసినది. ఆదర్శ దాంపత్యము కోరుకొనే యువజనాళి ఆచ్చట మొక్కుబడులు చెల్లించుచుండును. రాత్రులందు మాధవీ ఆనందుల ఆత్మలచ్చట సంచరించుచుండుననియు, ఆనందుని యుల్లాసమునకై మాధవి యొనర్చు గానము దూరమున నున్న పల్లెప్రజలకు యీనాటికి వినవచ్చుననియు అచ్చటి ప్రజలు చెప్పుకొనుచుందురు.

♦ ♦ ♦

ఏదో గానమువలె వినుపించి తెలివి వచ్చి చుట్టూ చూశాను. రైలు చక్రాల ధ్వని అవ్యక్తంగా యేదో గానరవళివలె వినుపిస్తోంది. స్టేషను దగ్గరపడి జనకోలాహలము స్పష్టంగా వినిపించుచున్నది. కాని యిది యంతయు స్వప్నమా!



అన్ని
నొప్పులకు
అమృతాంజనము

పండిత
డి గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17